జయజయ శంకర


హరహర శంకర



సంపుటి : 2 సంచిక : 11 & 12

# శ్రీ కామకోటి వాణి

శ్రీ క్రోధినామ భాద్రపద - ఆశ్వీయుజ మాసం, సెప్టెంబర్ - అక్టోబర్ 2024



శ్రీ కంచికామకోటి పీఠం, కాంచీపురము



# మన సనాతన ధర్మ లక్షణాలు – శాంతి, సురక్ష

అందరూ ఇప్పటివరకు చక్కటి విశ్లేషణను అందించారు.

బంగ్లాదేశ్ ప్రస్తుత స్థితిగతుల గురించీ, గత చరిత్రను తెలియచేస్తూ, దేశభక్తిని కనబరుస్తూ భారత సర్కారు ఈ విషయంలో ఏమేమి చేయ కలదో కూడా వివరించడం జరిగింది. మన అఖండ భారతదేశంలో భాగమైన బంగ్లాదేశ్ నేడు ఎన్నో క్లిష్ట పరిస్థితులను ఎదుర్కుంటోంది. 75 సంవత్సరములకు ముందు, దేశ విభజన సమయంలోనే శ్రీ చంద్రశేఖర సరస్వతి స్వామివారు విభజన సమంజసం, శ్రేయస్కరం కాదని చెప్తూ హిందుస్థాన్, పాకిస్థాన్ అని కాకుండా 'సంత్‌స్థాన్' అని దేశాన్ని గుర్తించాలని ఆదేశించారు. ఒక ఆంగ్ల పత్రిక సేలం నుండి ఈ సందేశాన్ని వెలువరించింది. ఐకమత్యంతో వుండాలన్న సహృదయంతో అప్పటి ముఖ్య వ్యక్తులయిన సర్దార్ పటేల్, అంబేద్కర్ లాంటి వారికి ఈ సందేశం పంపించారు. మన రాజ్యాంగములో వివిధ సంప్రదాయాలను, షణ్మతాలను (శైవం, వైష్ణవం, శాక్తేయం, గాణపత్యంలాంటివి) రక్షించడానికి ఒక రక్షా కవచం వుండాలని స్వామి వారి ఆదేశ సారాంశం. అప్పటి రాజకీయ నాయకులు స్వామివారి సందేశాన్ని గౌరవించి రాజ్యాంగంలో పొందుపరచడం జరిగింది. ఈనాటికీ మన సాంప్రదాయాలు మనుగడలో వున్నాయంటే మహాస్వామివారి ఆశీర్వాదమే. స్వామి వారి దీర్ఘదృష్టి వల్లనే మఠాల, మందిరాల సంరక్షణ, సాంప్రదాయాల పరిరక్షణలను పాలనా వ్యవస్థలో భాగంగా చేయడమైనది.

దేశ విభజన సమయంలో జరిగిన రక్తపాతం, హింస, ప్రజలకు వచ్చిన కష్టాలు, రాకపోకలకు ఇబ్బందులు చూసిన స్వామివారి హృదయం బాధపడింది. తరువాత దేశ ప్రజలకు ఇలాంటి కష్టం రాకూడదని, అశాంతి పునరావృతం కాకూడదని స్వామివారు ఉపవాసదీక్షను తామే చేయాలని సంకల్పించారు. (ఏకాదశి మొదలైన ఉపవాసాలు కాకుండా ప్రతి ఆదివారము సాయంత్రము 6 గంటల నుండి ఆహారం తీసుకోకూడదని నిర్ణయించుకున్నారు.) ప్రజల కష్టాలు



తీర్చడం కోసం ఉపవాస దీక్షను స్వయముగా చేపట్టిన మహాతపస్వి ఆయన. విభజన తర్వాత జరిగిన శారీరక, మానసిక వ్యధలకు సహన శక్తి కలిగిన ఆయనే చలించిపోయారు. 1947 నుండి ఆజీవితాంతము ఆ దీక్షను కొనసాగించారు. ప్రజల కష్టనివారణ కోసం పరితపించారు.

భారతదేశంలో అంతర్భాగమైన బంగ్లాదేశ్‌ను బ్రిటిష్‌వారి కాలంలో 'ఈస్ట్ బెంగాల్'గా పిలిచేవారు. తర్వాత ఈ ప్రాంతం పాకిస్తాన్‌గా, బంగ్లాదేశ్‌గా మారింది. 1905 నుండి ఇప్పటి వరకు జరిగిన 120 సంవత్సరాలూ కష్టకాలమే. అనేక మార్పులవల్ల వచ్చిన కష్టాలకు, అశాంతి, అనిశ్చితి పరిస్థితులను చూసి స్వామివారు చలించిపోయారు. ఒక ప్రకటనలో ఆయన సందేశం ఇస్తూ, శాస్త్ర దృష్టిలో ప్రాయశ్చిత్తం వుంటుందని ఎంతో దయతో, కరుణతో ప్రస్తావించారు. కష్టకాలంలో ఎవరికైతే అన్యాయం జరిగిందో ముఖ్యంగా మహిళలకు, పిల్లలకు ప్రత్యేక సదుపాయాలు అందిస్తూ సమాజంలో కలుపుకోవాలని కోరారు. సహాయము చేసినవారు ఎవరైనా సరే వారిని సన్మానించాలి. శాంతి, సురక్ష అనేవి మన సనాతన ధర్మ లక్షణం కాబట్టి కష్టాలలో వున్నవారికి తోడుగా వుండడం మన ప్రాథమిక లక్షణంగా ఆయన విశదీకరించారు.

ఒకసారి యాత్రలో భాగంగా సిలిగురిలో విడిది చేసి వుండగా, శ్రీ ప్రణబ్ ముఖర్జీగారితో, విదేశాంగ మంత్రి శ్రీ జస్వంత్ సింగ్‌గారితో మాట్లాడడం జరిగింది. మా గురువుగారు శ్రీ జయేంద్ర సరస్వతి స్వామి వారు ఢాకాలోని 'ఢాకేశ్వరీ దేవి' దర్శనం చేసుకోవాలని తెలిపినపుడు వారిరువురూ, రాజకీయంగా వేరే వేరే పార్టీల వారైనా సానుకూలంగా స్పందించారు. స్వామివారు ఢాకా వెళ్ళి చండీ హెూమం జరిపించి, బెంగాలీ భాషలో 'శంకరాచార్య గేట్' అని లిఖించిన పాలరాతి ఫలకాన్ని ఆవిష్కరించి, ఆ పిదప అమ్మవారి దర్శనం చేసుకుని రెండురోజుల పాటు ఇతర ప్రాంతాలను, పద్మా నదిని దర్శించుకుని తిరిగి వచ్చారు. ఈవిధంగా మనకు బంగ్లాదేశ్, పాకిస్థాన్లలో శక్తి పీఠాలున్నాయన్న విషయం ఎవరూ కాదనలేరు.

రాజకీయపరంగా వేరు దేశాలయినా సంస్కృతి, ఆధ్యాత్మికతపరంగా విశేషస్థలాలే. శక్తిపీఠాలన్నీ (51 శక్తి పీఠాలు) హిందువులకు పవిత్ర గౌరవనీయ స్థలాలు. అందువల్ల ద్వేషం, అహంకారం విడిచి పెట్టి అక్కడి ప్రజలకు మంచి జరగాలని ఆశిద్దాము. ఏ మత విశ్వాసం కలిగిన వారికైనా అక్కడి యువతకు ఉపాధి కల్పించే విధంగా ప్రయత్నం చేయాలి. వ్యవసాయం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తక్కువ కాబట్టి మన దేశంలో లాగా నైపుణ్యం, విద్య అభివృద్ధి చెందేలా ప్రోత్సాహం ఇవ్వవచ్చు.

భారతదేశం ఇప్పటివరకు ఎంతో సాయం చేసింది, చేస్తూనే వుంది కూడా. ప్రస్తుతం అక్కడ వున్న సమస్యల పరిష్కారాలకు చట్ట రూపం ఇవ్వాలని, రక్షణ కల్పించాలని ప్రయత్నం చేయాలి. కానీ, ఇంతకు



ముందు 27% వున్న హిందువులు ఇప్పుడు 9% వుండడం చాలా బాధాకరము. విచారించాల్సిన విషయం కూడా. ఈ విషయంపైన ఇంకొకసారి విశేషంగా చర్చించాలి. రాజకీయం అందరికీ తెలుసు కదా. కానీ ఈ విషయాన్ని ప్రేమతో, శాంతియుతంగా పరిష్కరించ డానికి ప్రయత్నం జరగాలి.

వీలయినంత త్వరగా ప్రశాంతత ఏర్పడేట్లుగా చూడాలి. అందరికీ సువిద్య, సురక్ష, సువిధ ఏర్పాట్లు సమకూర్చాలి. అక్కడ ప్రస్తుతం రామకృష్ణ సేవాశ్రమ సంస్థ వారు సేవలు అందిస్తున్నారు. శ్రీ ఢాకేశ్వరీ దేవి కృపతో ఆ దేశంలో మంచి వాతావరణం నెలకొనాలని ఆశిస్తున్నాము. యునైటెడ్ నేషన్స్ దృష్టి ఇటు వున్నా, లేకున్నా ఆ సంస్థ సహకారాన్ని తీసుకోవాలి. ఇటువంటి జటిల సమస్యని అందరూ కలిసి పరిష్కరించుకోవాలి. ఆ దేశంలో ప్రజలందరూ మంగళకరంగా, సుభిక్షంగా వుండాలని మన దేశ ఆకాంక్ష కూడా. ప్రత్యేకించి బంగ్లాదేశ్, పాకిస్థాన్ దేశాలలో సనాతన ధర్మం పాటించేవారు తిరుపతి, రామేశ్వరం, కాశిలాంటి పుణ్య క్షేత్రాలు దర్శించుకోవడానికి సరైన అవకాశాలు కల్పించాలి.

మన దగ్గర వున్న అల్ప సంఖ్యాకులకు అనేక సౌకర్యాలు భారతదేశం ఇస్తున్నందు వల్ల, ఇతర దేశాల్లో కూడా అలాగే ఇవ్వమని అడిగే హక్కు మన దేశం కలిగి వుంది. బంగ్లాదేశ్‌లోని ప్రజల ప్రశాంత జీవనానికి అవసరమైన విద్య, వ్యాపారము, నమ్మకాలు, మందిరాలు, మతాల సంరక్షణ సజావుగా జరిగేలా చూడాలని మన భారత ప్రభుత్వాన్ని కోరుతున్నాము. అక్కడి ప్రాంతీయ అభివృద్ధి సంస్థలతో భారత ప్రభుత్వము సంప్రదింపులు జరిపి అభివృద్ధికి ముందడుగు వేయాలని మేము కోరుతున్నాము. హిందువులన్న వారు ఏ సమస్య వచ్చినా ఏ ప్రాంతములో వున్నా సంఘటితంగా వుండాలి.

ఆర్ణాబ్ గోస్వామి రాజకీయ కార్యక్రమాలు చేస్తూ వుంటారు. ఇప్పుడు మొదటిసారిగా ధర్మం కోసం కార్యక్రమం చేస్తున్నారు. ఆయనకు మా శుభాశీస్సులు. రాజకీయ పార్టీలన్నీ బంగ్లాదేశ్ విషయంలో ఒక మాట మీద ఎలా ఉన్నాయో, అలాగే అన్ని సాంప్రదాయాల వారు ఒకే మాట మీద వుండి బంగ్లాదేశ్‌లో ప్రశాంతత నింపాలి. హిందువుల రక్షణ కోసం ప్రయత్నాలు చేయాలి.

**హరహరశంకర – జయజయశంకర**

# రామేశ్వరం పర్యటనలో శ్రీకంచి పీఠాధిపతి శ్రీ విజయేంద్ర సరస్వతీ స్వామి అనుగ్రహభాషణం



జులై 17, 2024న రామేశ్వరం పర్యటనలో భాగంగా శ్రీకంచి పీఠాధిపతి శ్రీ విజయేంద్ర సరస్వతీ స్వామి అనుగ్రహభాషణం –

రామేశ్వరంలోని రామనాథ స్వామి దేవస్థానంలో ఉదయం (19–7– 2024) 'గంగాభిషేకం, విశేష పూజ'లు నిర్వహించిన అనంతరం పూజ్య శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామీవారు భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణం చేశారు.

మన దేశ సనాతన సంప్రదాయం, వారసత్వాన్ని శ్లాఘిస్తూ, 'పూర్వాచార్యుల' యాత్రలను గుర్తు చేసుకుని, శాంతియుతమైన, సౌభాగ్యవంతమైన, సామరస్యపూర్వకమైన జీవితాన్ని గడిపేందుకు, సమాజాన్ని సేవించేందుకు ధార్మిక సూత్రాలను అందరూ అనుసరించాలని ఉద్బోధించారు. రామేశ్వరంలోని కంచిమఠం తన విద్యా కార్యకలాపాలను విస్తరించనుందని స్వామి చెప్పారు.

మన భారతదేశంలో అందరూ మంచి జీవితం, సంక్షేమం పొందడం కోసం 'ధర్మం, భక్తి, సమైక్యత'ను ప్రోత్సహించాలని నొక్కి

చెపుతుంటారు. మంచి ఆలోచనలను, వ్యక్తుల మధ్య సామరస్యాన్ని పాదుకునేలా చేసేందుకు, ప్రాచీన తమిళ సంప్రదాయం మనకు 'ధార్మిక ప్రవృత్తిని కలిగి ఉండండి' (నీతిగా జీవించండి), 'దేవాలయాలలో ఆరాధన చేయడమే ఆదర్శాలలో ఉత్తమమైంది', 'తల్లిదండ్రులే మన ప్రథమ దైవాలు' వంటి బంగారంలాంటి సూక్తులను ఇచ్చింది. ఈ ధర్మాల న్నింటినీ 'ఆచారకోవై' అన్న గ్రంథంలో నొక్కి చెప్పడం జరిగింది.

చిన్న వయసు నుంచే అటువంటి సరైన ఆలోచనను బోధించేందుకు మన పూర్వీకులు 'గుడిలేని ఊళ్లో జీవించకండి' వంటి అనేక ఆదేశాలను, సూచనలను చేశారు. కేవలం ఆ సూత్రాల ఆధారంగా పురాతన కాలం నుంచీ చిన్న చిన్న గ్రామాలు, పట్టణాలలో కూడా ఆలయాలను నిర్మించారు. ఆలయ 'గోపుర' దర్శనమే ప్రజలకు ఎంతో పుణ్యాన్ని అందిస్తుంది. మన పూర్వీకులు, రాజులు, రుషులు ఆలయాల వంటి సుసంపన్నమైన వారసత్వాన్ని మనకు అందించారు. తద్వారా వాటి సార్వత్రిక లబ్ధి ప్రతి ఒక్కరికీ చేరి, సరైన పనులను చేయడం ద్వారా ప్రజలు పుణ్యం సంపాదించుకునేందుకు తోడ్పడుతుంది.

ఆ తాత్వికతకు అనుగుణంగా తమిళ భక్తి గీతాలు, శ్లోకాలు – దక్షిణ భారతంలో శివుడే ఆ జగత్పతి అంటూ ప్రార్థించడమే కాదు, మానవాళి మొత్తంలో నివసించే విశ్వజీవిగా ఎలా ఆరాధిస్తారో వివరిస్తాయి. మన దేశంలోని దక్షిణ ప్రాంతంలో గల రామేశ్వరంలోని శ్రీ రామనాథస్వామి ఆలయం మానవాళి కష్టాలను, బాధలను పరిష్కరించే యాత్రా కేంద్రంగా ప్రసిద్ధికెక్కింది. మరొక చోట మనం 'పవిత్ర జలాలు', నదులు, చెరువుల్లో ఉంటాయని వింటుంటాం, కానీ, రామేశ్వర ద్వీపంలో సముద్రమే 'అగ్ని తీర్థం'గా పిలిచే 'పవిత్ర జలాల'నే కాదు అనేక భిన్న 'తీర్థాలను' కలిగి ఉంటుంది.

భారతదేశం నలుమూలల నుంచీ, ఆసేతు హిమాచలం అన్నట్టుగా హిమాచల్ ప్రదేశ్ నుంచి, పొరుగుదేశాలైన నేపాల్, ఇతర దేశాల నుంచీ భక్తులు గొప్ప భక్తి శ్రద్ధలతో రామేశ్వరానికి వచ్చి శివుడి ఆరాధన చేస్తారు. 'అద్వైత' సిద్ధాంతకర్త అయిన ఆదిశంకరుడు, శివుడిపై



అత్యున్నత భక్తి ప్రపత్తులతో కొన్ని శతాబ్దాల కింద ఇక్కడకు వచ్చారు.

మహాశివరాత్రి రోజున ప్రభు శ్రీరాముడు ప్రార్థనలు చేసిన ఆలయంగా, శ్రీ రామనాథ స్వామి, పర్వతవర్ధిని అమ్మవారి కోసం నిర్మించిన ఈ ఆలయ ప్రత్యేకతను గురించి ఈ సంస్కృత శ్లోకం తెలియచేస్తుంది. దేశంలోని 12 జ్యోతిర్లింగ క్షేత్రాలలో ఒకటిగా రామేశ్వరాన్ని ఆదిశంకరులు కొనియాడారు.

నిర్మాణ సౌకర్యాలు అత్యంత తక్కువగా అందుబాటులో ఉన్న సమయంలోనే ఇక్కడి సుందర ఆలయాన్ని నిర్మించారు. దాని అందమైన 'ప్రాకారాల'ను చూడండి, ఈ ఆలయాన్ని నిర్మించడానికి ఎంత సుందరంగా, కళాత్మకంగా చోటును ఉపయోగించుకున్నారో మనకు అవగతమవుతుంది. ఈ ప్రత్యేక ఆలయాన్ని చాలా చిన్న వయసులో, అంటే 1920ల్లో మన కంచి కామకోటి మఠం పరమాచార్యులు (శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి) సందర్శించారు.

ఆ రోజుల్లో కూడా దేశ సంక్షేమం కోసం ప్రార్థిస్తూ, మహాత్మా గాంధీ బోధించిన అహింసా మార్గానికి కట్టుబడి పూజ్యనీయ మహాస్వామి పట్టు బట్టలు కట్టడం మానేసి, 'ఖాదీ' ధరించడం ప్రారంభించారు. సుమారు 200 జతల 'ఖద్దరు ధోవతీ'లను మదురై నుంచి తెప్పించవలసిందిగా మహాస్వామి కోరారు. రామేశ్వరానికి అత్యంత దక్షిణ కొసన ఉన్న ధనుష్కోటి వద్ద సముద్రంలో స్నానమాచరించి వాటిని ధరించడం మొదలుపెట్టారు.

అంత చిన్న వయసులోనే కంచి పరమాచార్యుల నిరాడంబరత, భక్తి, దేశభక్తికి అది ఒక తిరుగులేని ప్రమాణం. రామేశ్వరంలోని ధనుష్కోటి నుంచే మహాస్వామి 'ఖాదీ' ధరించడం ప్రారంభించారు. ఆయన అనేకసార్లు రామేశ్వరంలో పర్యటించి, రామనాథ స్వామికి 'అభిషేకాన్ని' నిర్వహించారు.

తర్వాతి కాలంలో కంచి మఠానికి అధిపతి అయిన శ్రీ జయేంద్ర సరస్వతి స్వామివారు పరమాచార్యుల అడుగుజాడలను అనుసరిస్తూ 'ధర్మాన్ని', దాని సారాంశాన్ని సరళమైన, తేలికగా అర్థం చేసుకోగల శైలిలో ప్రజలకు అందిస్తూ, పలుమార్లు రామేశ్వరాన్ని సందర్శించి, రామనాథునికి 'అభిషేకాన్ని' నిర్వహించడమే కాకుండా అనేక నిర్మాణ పనులను చేపట్టారు.

గత ఏడాది ఇదే రోజున మేం కాశీ (బెనారెస్) తీర్థ దర్శనానికి బయలుదేరి, ప్రయాగరాజ్ (అలహాబాద్) సహా ఉత్తరాదిలో ఉన్న పలు పుణ్యక్షేత్రాలను అక్కడి ప్రధాన/ మూల దేవతలను పూజించేందుకు పర్యటించాం. అది చాలా ప్రత్యేకమైంది.

తమిళ మాసమైన 'ఆడి', 'ఏకాదశి' (బహుళ ఏకాదశి) అయిన



ఇదే రోజున గత ఏడాది మేం ప్రయాగరాజ్ నుంచి పవిత్ర గంగా జలాలను 'కలశం'లో సేకరించుకుని వచ్చాం.

ఈ సందర్భంగా, అంతకు ముందు ఏడాది ధనుష్కోటిలో సేకరించిన ఇసుక ఆకారం కలిగిన 'శివ లింగాన్ని' ప్రయాగరాజ్‌కు తీసుకువచ్చి గంగా నదిలో నిమజ్జనం చేయడం జరిగింది.

దీని అనంతరం, గంగ పవిత్ర జలాలను సేకరించి, పలు 'కలశాలలో' భద్రపరచడం జరిగింది. ఏడాది పొడవునా 'పూజలు' నిర్వహించిన ఈ 'కలశాలను' అక్కడి నుంచి దక్షిణాదికి తీసుకువచ్చి, నిన్న తిరువానైకవల్ (శ్రీరంగం దగ్గర, తిరుచిరాపల్లి)లో వాటికి ప్రత్యేక పూజలు నిర్వహించాం. అక్కడి నుంచి మేం పవిత్ర గంగా జలాలు కలిగిన 'కలశాలను' రామేశ్వరానికి ఈ రోజు తీసుకువచ్చాం. 'ఏకాదశి' రోజున 'రుద్రాభిషేకాలు', 'హోమాలు' నిర్వహించడం జరిగింది.

శ్రీ విష్ణుమూర్తికి, లలితా అమ్మవారికీ– 'విష్ణు సహస్రనామం', 'లలితా సహస్రనామం' ఉన్నట్టుగానే మనకు గంగా మాతను అభివర్ణించి, స్తుతించే 'గంగా సహస్రనామం' కూడా ఉంది.

ఆ భగవంతుడి కృప వలన నిత్య పూజలు అందుకున్న 'కలశాలల్లో'



నిల్వ ఉంచిన పవిత్ర జలాలతో శ్రీ రామనాథ స్వామికి 'అభిషేకాన్ని' చేసే అవకాశం నాకు ఈవేళ వచ్చింది.

శ్రీ కంచి పరమాచార్య, ఆయన తదనంతర పీఠాధిపతి పూజనీయ శ్రీ జయేంద్ర సరస్వతి స్వామివారు ఆ భగవంతుడి సేవలో భాగంగా వారు చేసిన ఆరాధనలను కొనసాగించమని మనను ఆశీర్వదించారు.

రామేశ్వరం ప్రజలను కూడా శాంతియుతంగా, ఆనందంగా ఉంచే జాతీయ సమగ్రతను మేం అటువంటి సేవ ద్వారా ప్రోత్సహిస్తాం. ఆషాఢ ఏకాదశి అయిన ఈ రోజు చాలా విశేషమైనది. ముఖ్యంగా, బుధవారంనాడు, కంచి పరమాచార్య శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి వారి జన్మ నక్షత్రమైన 'అనుషం' (అనూరాధ) కావడంతో నేడు మరింత విశిష్టమైంది. ఇది 'మంచితనం', 'సురక్షిత జీవనాన్ని' కలిపి ఉంచే ఒక పవిత్రమైన సందర్భం కూడా.

'అనుషం' లేదా 'అనూరాధ' నక్షత్ర అధిపతి 'మిత్రన్' (మిథున్) అంటే స్నేహం, స్నేహపూర్వకం అని. కంచి పరమాచార్య జన్మనక్షత్ర లక్షణం అటువంటిది!

ఆ పర్వతవర్ధిని అమ్మవారిని, రామనాథ స్వామిని ప్రజలందరికీ 'సదాలోచనలు' ఇచ్చి, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్య ఐశ్వర్యం, సమైక్యతలతో జీవించేలా ఆశీర్వదించాలని కోరుతున్నాను. ఈ సందర్భం సాధ్యమయ్యేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసిన తమిళనాడు హిందూ రెలీజియస్ అండ్ ఛారిటబుల్ ఎండోమెంట్స్ శాఖ (హెచ్ఆర్ అండ్ సిఇ) అధికారులకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

కంచి మఠం రామేశ్వరం ద్వీపంలో మంచి గుణాత్మక విద్యను అందించేందుకు అదనపు సౌకర్యాలను సృష్టించడం ద్వారా విద్యా కార్యకలాపాలను విస్తరించాలనుకుంటోందని ప్రకటించాలనుకుంటున్నాను. అబ్దుల్ కలాం (భారత మాజీ రాష్ట్రపతి) వంటి వ్యక్తులు ఈ చోటు నుంచి వచ్చారని, రామేశ్వరం ప్రజల జీవితాలను మెరుగుపరచేందుకు కూడా ఇతర చొరవలను చేపట్టాలని మఠం యోచిస్తోంది. అందరూ ఆయురారోగ్యాలతో, సంతోషంగా ఉండాలని ఆ స్వామిని ప్రార్థిస్తున్నాను.



# కాశీలో శంకర నేత్రాలయ ప్రారంభోత్సవ సందర్భంగా ప్రధాన మంత్రి శ్రీ నరేంద్రమోడీ గారి సమక్షంలో శ్రీ శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి వారి అనుగ్రహ భాషణం..

**శ్లోకాలు :**

ఈ రోజు ఎంతో సుదినం. ఈ సమయంలో కాశీ విశ్వనాథుని అనుగ్రహం అందరిపై వుంది. ఈ పవిత్రమైన పుణ్యభూమి పై నేత్రోత్సవం – మూక పంచశతిలో చెప్పినట్టుగా వుంది. చూడడానికి ముచ్చటగా వుంది. కళ్ళకు సంబందించిన చికిత్స,సేవలు అందించడం చాలా విశేషమైన కార్యక్రమము. తొలుతగా ప్రారంభదశలో కోయింబత్తూరులో మహాస్వామివారి ఆశీస్సులతో డాక్టర్ రమణి వారి సతీమణి రాధారమణి ఈ సేవా కార్యక్రమాన్ని మొదలుపెట్టారు.

ప్రస్తుతం ఇలాంటి 16 ఆస్పత్రులు రాష్ట్రానికి ఒకటిగా వున్నాయి. ఈ సేవల వల్ల లక్షలాదిమంది లబ్ధి పొందుతున్నారు. ఇప్పుడు 17వ ఆస్పత్రిని ఇక్కడ ప్రారంభించారు. మోడీగారు కోయింబత్తూరులో రమణి గారి ఈ సేవను 'నేత్ర యజ్ఞ' అని ప్రశంసించారు. చక్కగా జరుగు తున్నాయి. యూపీ రాష్ట్రానికి 2 ఆస్పత్రులు – ఒకటి కాన్పూరులో, ఒకటి వారణాసిలో.

ఇప్పుడు మన దేశం ప్రగతిపథంలో వుంది. చైతన్యవంతంగా వుంది. దీనికి ముఖ్య కారణం సమర్ధుడైన నేత మన దేశానికి వుండడమే. ఎందుకంటే సమాజానికి వ్యక్తి, వ్యక్తిత్వం రెండూ అవసరము. అన్నింటినీ సమన్వయం చేస్తూ అందరినీ కలుపుకొని పోయే నాయకుడు కూడా అవసరము. మన శాస్త్రాల ప్రకారం, ఒకసారి దేవదానవుల యుద్ధం జరిగింది. దేవతలకు జయాన్ని చేకూర్చడానికి




ఒక సమర్థుడైన రాజు వుండాలని వారు సభలో చర్చించి నిర్ణయించారు. అక్కడ ఒక రాజు వున్నారు. అతడు సోముడు.

ఆ సోముడిని రాజుగా చేశారు. ఆ పిదప అన్నింటిలోనూ జయం ప్రాప్తించింది. అలాగే విశ్వంలోనే గొప్ప ప్రజాస్వామ్యమైన మన దేశాన్ని ప్రజారాజ్యంగా స్వీకరించాం. స్వతంత్ర భారతదేశంగా నిర్మించే సమయంలో కొన్ని ఘటనలు సంతోషించదగినవి, బాధాకరమైనవి వున్నాయి. సంఖ్యాబలం కలిగిన మంచి నాయకుడు ఇప్పుడు వుండడం ఈశ్వర కృప. నరేంద్ర దామోదర్ మోడి లాంటి నాయకుడు వుండడం మహాపురుషుల ఆశీర్వాదం, ఈశ్వరానుగ్రహం. వీరి ప్రభుత్వం NDA అంటే 'నరేంద్ర దామోదర్ అనుసాసన్'. ప్రజల సురక్ష, సువిద్య, సుభిక్ష కోసం వీరి ప్రభుత్వం పాటుపడుతోంది. ఒక ఆదర్శమైన ప్రభుత్వముగా చైతన్యవంతంగా, జాగృతితో, మెళకువతో జీవ రక్షణతో పాటు ముందడుగులు వేస్తోంది.



వీరి పరిపాలనలో అన్ని రాష్ట్రాలతో, తమిళనాడు సహా సత్సంబంధాలు కలిగి వున్నారు. అందుకే 140 కోట్ల ప్రజల సంక్షేమం కోసం ప్రేమతో సంక్షేమ పథకాలు ఏర్పాటు చేశారు. అన్నపూర్ణ దేవి అనుగ్రహంతో మొన్నటి మహమ్మారి కష్ట సమయంలో మోడీ గారు అందరికీ ఆహారాన్ని అందించారు. సామాన్యుడి కష్టాలు తెలిసిన వ్యక్తి. అనుభవంతో కూడిన జ్ఞానం వలన సామాన్యుడి ఇబ్బందులను దూరం చేయడానికి కృషి చేశారు. వారి దృక్పథం, ఆలోచనలన్నీ ఇప్పుడు సాకారమవుతున్నాయి. మన దేశానికి భౌతిక వికాసం ఎంత అవసరమో మన ధర్మము, సంస్కృతి వికాసాలు కూడా అంతే అవసరం. మన దేశ ఉన్నతి కోసం, అభ్యుదయం కోసం మన ధర్మాన్ని సంస్కృతిని దేశ ఉజ్వల భవిష్యత్తు కోసం కాపాడుకోవాలి. అందుకే బహుముఖి ప్రజ్ఞాశాలి నాయకులు అవసరం. యూపీ రాష్ట్ర ముఖ్య మంత్రి యోగిగారు కూడా శాంతి స్థాపన కోసం కొన్ని కఠిన చర్యలు చేపట్టారు.

మన దేశ ఉజ్వల భవిష్యత్తు విశ్వశాంతికి దోహదం అవుతుంది. మన దేశ ఉన్నతే విశ్వఉన్నతి. విశ్వగురువుగా మనం ఎదగాలంటే విశ్వసభలో మన స్థానం కోసం మనమందరూ ప్రార్థనలు చేయాలి. మన ధర్మం, సంస్కృతిని కాపాడుకోవాలి. కంచికామకోటి పీఠం విద్య, వైద్య, వేద సంరక్షణకై నిరంతరం శ్రమిస్తోంది. విద్య కోసం స్కూల్స్,






కాలేజిలు, యూనివర్సిటీలు నెలకొల్పారు. వైద్యం కోసం శంకరా నేత్ర ఆస్పత్రులు చిన్నగా మొదలై ఇప్పుడు దేశమంతా విస్తరించాయి. పేదలకు, ధనికులకు కూడా స్థాయీ భేదం లేకుండా ఆదరంగా చికిత్స జరుగుతుంది. చక్కగా నిర్వహిస్తున్నారు. వేదాలకోసం పరమాచార్య మహాస్వామి వారు, గురువు గారు, వేద సంరక్షణ కోసం – ముఖ్యంగా అథర్వణ వేద సంరక్షణ కోసం, అథర్వణవేదాన్ని పఠిస్తూ, రక్షిస్తూ వున్న గుజరాత్‌లోని బరోడాకు దానిని నేర్చుకునేందుకు 50, 60 సంవత్సరాల మునుపే ఇద్దరు వ్యక్తులను మహాస్వామివారు పంపించారు. అక్కడ పంచోలి అనే వేద పండితుడు వుండేవారు. ఆ ఒక్క కుటుంబమే తమ వ్యాపారంతో పాటు తరతరాలుగా అథర్వణ వేదాన్ని పఠించేవారు. అక్కడి నుండి అది వ్యాపించింది. ప్రస్తుతం 200, 250 మంది అథర్వణ వేద పండితులు వున్నారు. మన సంస్కృతి, సనాతన ధర్మం విజ్ఞానంతో కూడినవి.

సనాతన ధర్మం ఒక దృఢ నమ్మకం, వికాసానికి హేతువు. నమ్మకం, వికాసం, విద్య, విజ్ఞానము – అన్నీ అవసరమే. మోడీగారి చొరవతో ఇవన్నీ సక్రమంగా వున్నాయి. ప్రథమంగా వారు సోమనాథ్ నుండి కార్యాన్ని ప్రారంభించారు. అక్కడి ట్రస్ట్ అధ్యక్షుడి హోదాలో విశేష కార్యక్రమాలు జరిగాయి. ఆ పిదప కేదార్నాథ్‌లో. శంకరాచార్యుల వారు ఎక్కడ దానం చెయ్యాలో చెప్పారు. అన్నదానం ఎక్కడ చేయాలి. భోజనశాలలు ఎక్కడ వుండాలి. ఆకలి కొన్నవారికి అన్న దానం చేయాలి. ఇక్కడ అన్నదానం సరే. కానీ కేదార్లో చాలా చలి, మంచు. దేశ పొలిమేరలో మనా గ్రామం వద్ద ఎవరికీ లేదనకుండా ఆహార వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఇపుడే కాదు. గుజరాత్ ముఖ్య మంత్రిగా వున్నపుడు కూడా కేదార్‌నాథ్‌లో ప్రకృతి విలయం జరిగినపుడు కొద్ది మంది డాక్టర్లతో బాధితులకు స్వయం సహాయం అందించారు. దేశ భక్తి, దైవ భక్తిని మోడీ గారు చూపించారు.

దేశభక్తి, దైవభక్తి రెండూ వుండాలని మా గురువుగారు ఒకమారు చెప్పారు. దైవభక్తి కంటే కూడా దేశభక్తి వుండాలని అనేవారు. కేదార్ నాథ్‌లోని కార్యక్రమము చాలా విశిష్టమైనది. ఎక్కడ అత్యవసరము వుందో అక్కడికి ఎటువంటి ఆటంకాలున్నా సహాయ సహకారాలు ముందుగా అందించాలి.

ఆ పిదప కాశీ విశ్వనాథ్. మహాత్మ గాంధీ కాశి, అక్కడి అశుభ్రతను చూసి 'ఇవన్నీ ఎవరు చేయగలరు' అని అన్నారుట. గాంధీజీ బనారస్ యూనివర్సిటీ, విశ్వనాథ్ మందిరం కూడా సందర్శించారు. స్వచ్ఛత కోసం గాంధీజీ అపుడు పరితపించారు. వారి ఆశయాలన్ని కార్యాచరణలో పెట్టడానికి ఆ విశ్వనాథుడే పంపించినట్టుగా ఇపుడు మోడీజీ 'స్వచ్ఛ భారత్' అనే కార్యక్రమాన్ని రూపొందించారు. కాశి విశ్వనాథ్ మందిర ప్రాంగణం అంతా కొత్త రూపం దాల్చింది.

గత సంవత్సరం మేము చాతుర్మాస దీక్ష ఇక్కడ చేసినపుడు యోగీజీ గారితో మందిర ప్రాంగణం అంతా చూసాము. అద్భుతంగా చేశారు. గంగానది ఒడ్డున మా అనుష్టానాదులు చేసుకున్నాం. ఆలయప్రాంగణ సుందరీకరణ, పరిసర ప్రాంతాల శుభ్రత ఎంతో ఆకట్టుకునేట్టుగా తీర్చిదిద్దారు. శంకరాచార్యులవారు ఆనంద ఆనందం వనే వసంతం అని అన్నారు. అలాగే ఒక అందమైన ఆనందవనంలా వుంది.



అంతే కాదు.. క్షిప్రానది సమీపాన ఉన్న మహాకాళేశ్వర్ ఆలయప్రాంగణం కూడా. విశాలమైన మంటపాలతో భవ్యమైన రీతిలో అద్భుతంగా నిర్మాణం చేశారు. భవ్యము, దివ్యము భారతదేశానికి అవసరము. వ్యాపారనిమిత్తం, భౌతిక అవసరాల కోసం భవ్యంగా వుండాలి. శాంతి, సమృద్ధి కోసం దివ్యంగా వుండాలి. అక్కడి మహాకాల్ మందిర ప్రాంగణంలో అడుగు పెట్టగానే గొప్ప ఘనమైన మంటపాలు స్వాగతిస్తాయి. ఇంకా చేయవలిసిన కార్యముంది. మేము కూడా వెళ్ళి దర్శనం చేసుకోవాలి. మన దేశంలో మహత్తరమైన ప్రణాళికలు జరుగుతున్నాయి. ప్రజాస్వామ్య పద్ధతిలో అందరి సహకారంతో అందరి క్షేమం కోసం ఒక గట్టి సంకల్పం వున్న నాయకుడి ద్వారా కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు ఇవన్నీ సాకారం అవుతున్నాయి. కాశ్మీరులో ఇటీవలే ఎన్నికలు జరిగాయి. శంకరాచార్యులవారి పేరుతో ఒక కొండ వుంది. మేము దర్శనానికి అక్కడికి వెళ్ళాము. మోడీగారితో మాకు అప్పటినుండీ (1997)పరిచయం వుంది. దేశ ప్రగతి కోసం, ఉన్నతి కోసం ఉత్తరప్రదేశ్‌తోపాటు సమృద్ధిగా వుండాలని మేము ప్రార్థిస్తున్నాము. మన దేశంలోని 12 జ్యోతిర్లింగ క్షేత్రాల పునరుద్ధరణ జరుగుతున్నది. వీరు అంబాజిలో కూడా సువర్ణ శిఖరం చేయించారు. 51 శక్తి పీఠాలలో అంబాజీ ఒకటి. మాకు వీరి పరిచయం గుజరాత్ నుండీ ఉందని మా గురువుగారికి తెలిపాము.

మన దేశము ఇంకా పురోభివృద్ధి సాధించాలి. 140 కోట్ల ప్రజలందరూ సుభిక్షంగా ఆరోగ్యంగా వుండాలని కాశీ విశ్వనాథులవారిని ప్రార్థిస్తున్నాము. అలాగే సన్యాశ్రమ పరంపరలోని వారందరినీ కూడా. అనేక ప్రధానమంత్రులు పరిశ్రమించారు. అటల్ బిహారి వాజపేయి గారు వున్నపుడు మా గురువుగారు దేశశాంతి కోసం చర్చించారు. 500 సంవత్సరాల ప్రయత్నము, నిరీక్షణల పిదప, విశ్వ ప్రయత్నం చేసి న్యాయస్థానం ద్వారా చట్టబద్దంగా రాములవారి మందిరాన్ని నరేంద్ర దామోదర్ మోడీగారు నిర్మించారు. 'బాలక రామ్'ల వారిని ప్రతిష్టించారు. దశరథ మహారాజు సుపుత్రుడు ఈ రాముడు. అక్కడ జన్మించారు రాములవారు, కంచి కామాక్షి అమ్మవారి అనుగ్రహంతో.

ఆదిశంకరాచార్యులవారు శ్రీచక్ర యంత్ర ప్రతిష్ట చేశారు ఆ కామాక్షి మందిరంలో. ఆ శంకరాచార్యుల పరంపరలోనే మహాస్వామివారు, మా గురువుగారు విచ్చేసారు. అక్కడ దశరథ మహారాజుల వారు సంతాన ప్రాప్తి కోసం తపస్సు చేశారు.

కామాక్షి అమ్మవారి అనుగ్రహంతోనే వారికి సంతానప్రాప్తి కలిగింది. అక్షి అంటే కన్ను. అందుకే కళ్ళ చికిత్సలు జరుగుతున్నాయి. దశరథ్ అంటే 10 దిశలు. 8 దిశలు ఆకాశము భూమితో కలిపి 10. దశరథుల అంటే దశ దిశల..ఆ సహకారంతో రామ మందిర స్థాపన జరిగింది. దేశ విదేశాలలోని అందరి సహకారంతో నెరవేరింది. వసుధైక కుటుంబం. మన దేశంలో ట్రేడ్, ట్రెడిషన్, టెక్నాలజీ – మూడూ వుండాలి త్రివేణిలాగా. ఇక్కడ త్రివేణి వుంది. అక్కడ మహా కుంభ్ చేయబోతున్నారు 2025లో. గతంలో కొన్ని సంవత్సరాల క్రితం మీరు కుంభ్ జరిపించారు. చక్కటి ప్రణాళికతో నిర్వహించారు – శుభ్రత, నియమావళి, శాంతి భద్రతలు పాటిస్తూ. NRIల కోసం కాశీలో మంచి సౌకర్యాలు కలుగచేసారు. ప్రవాసీలకే కాకుండా ఇక్కడి నివాసి భారతీయులకు కూడా కలిగించాలి. రాబోయే కుంభ్‌లో భక్తులందరికీ సౌకర్యాలు కలిగించాలి. విశ్వనాథుల వారి అనుగ్రహంతో అందరికి ధనసంపద ప్రాప్తి, ఉద్యోగప్రాప్తితో పాటు పుణ్యప్రాప్తి కలగాలని ప్రార్థిస్తున్నాము. సమగ్రవికాసం కోసం మందిరాల్లో ప్రార్థనలు చేయాలి, ప్రయత్నాలు చేయాలి. అందరికి మంచి జరగాలని ప్రార్థిస్తున్నాము.

ధర్మానికి జయము అధర్మానికి వినాశము. అందరిలో సత్భావన వుండాలి. విశ్వశాంతికి, గోమాతకు రక్షగా ఉండాలి.

**హరహర మహాదేవ్**

**జయజయ శంకర**



# మూకపంచశతి ఆర్యాశతకం

- బాలాత్రిపురసుందరి చిర్రావూరి

శ్లో॥ కుడ్మలిత కుచ కిషోరై: కుర్వాణై: కాంచిదేశ సౌహార్దమ్ ।
కుంకుమశోణైర్నిచితం కుశలపథం శంభుసుకృతసంభారై: ॥ ॥33॥

**పద విభాగం:** కుడ్మలితకుచకిషోరైః – కుర్వాణైః – కాంచిదేశసౌహార్దమ్ – కుంకుమశోణైః – నిచితం – కుశలపథం – శంభుసుకృతసంభారైః

**అన్వయం:** కుడ్మలితకుచకిషోరైః కాంచిదేశసౌహార్దమ్ కుర్వాణైః కుంకుమశోణైః శంభుసుకృతసంభారైః కుశలపథం నిచి

**ప్రతిపదార్థం :** కుడ్మలితకుచకిషోరైః= మొగ్గతొడిగిన చిన్న వక్షోజములు కాంచిదేశసౌహార్ధమ్= కాంచీదేశముతో స్నేహమును కుర్వాణైః =చేయుచున్న కుఙ్కమశోణైః =కుంకుమ వలె ఎర్రనైనవియగు శమ్భుసుకృతసమ్భారైః = శివుని పుణ్యముల అతిశయముల చేత కుశలపథం =మంగళమార్గము నిచితమ్= నింపబడినది.

**తాత్పర్యము:** మొగ్గల వంటి చిన్న వక్షోజములు గల కాంచీదేశముతో స్నేహము చేయుచున్న కుంకుమపూత పూసినట్లు ఎర్రనైఉన్న శివుని అతిశయించిన పుణ్యములచే క్షేమమార్గము నిండియున్నది.

**బాలమనోజ్ఞా:** ఇక్కడ యౌవనారంభంలో ఉన్న అమ్మవారిని భావిస్తున్నారు. కుచయుగప్రదేశమునుండి మధ్య భాగమైన నాభిస్థానమువరకు త్రికోణముగా భావించి కామరాజబీజముతో అమ్మవారిని ధ్యానించాలని నిగూఢముగా చెప్తున్నారు మూకకవి.

శ్లో అంకితకచేన కచేన కేనచిత్ అంధఙ్కరణౌషధేన కమలానాం ।
అంతః పురేణ శంభో: అలంక్రియా కాపి కల్ప్యతే కాంచ్యామ్ ॥ ॥34॥

**పదవిభాగం:** అంకితకచేన- కేనచిత్-అన్ధంకరణౌషధేన- కమలానామ్-అన్తఃపురేణ-శమ్భోః- అలఙ్క్రియా- కాంఅపి- కల్ప్యతే -కాఞ్చ్యామ్.



**అన్వయం:** కేనచిత్ కమలానాం అన్ధంకరణౌషధేన అఙ్కితకచేన శమ్భోః అన్తఃపురేణ కాఞ్చ్యాం కాం అపి అలఙ్క్రియా కల్ప్యతే.

**ప్రతిపదార్థం :** కేనచిత్= ఒకానొక కమలానాం = కమలములకు అన్ధంకరణౌషధేన= గుడ్డితనమును కలుగజేయు ఔషధముచే అఙ్కితకచేన = చిహ్నితములైన కేశములు గల శమ్భోః=శివుని అన్తఃపురేణ= అంతఃపురము చేత క్చ్యాం = కాంచీనగరమునందు కాం అపి= ఒకానొక అలఙ్క్రియా= అంకారము కల్ప్యతే= కల్పింపబడుతున్నది.

**తాత్పర్యము:** కమలములకు గుడ్డితనమును కలుగజేయు ఔషధము చేత, గుర్తులు గల కేశములు గల శివుని అంతఃపురముచేత, కాంచీపురమునందు అలంకారము కూర్చబడినది.

**బాలమనోజ్ఞా:** కమలములు చంద్రునిచే వికసిస్తాయి. కమలములు చూడటానికి కారణం చంద్రుడౌతున్నాడు. శివుని జటాజూటంలోని చంద్రుని కాంతి వలన కమలములు చూపును పొంది, కమలములు వికసిస్తున్నాయి. కానీ వాటికి గుడ్డితనమును కలుగజేసే మందు శివుని కేశాలకు పూయబడినదట. కంపానదిలో ఉన్న కమలాల వైపు వెనుకభాగం ఉంచి అమ్మవారు శివునికి అభిముఖంగా ఉన్నారని మూకకవి వర్ణిస్తున్నారు. కమలాలకు అభిముఖంగా ఉంటే శివుని తలలో ఉన్న చంద్రుడు అమ్మవారి శిరస్సున కూడా ఉంటాడు. దానివలన కమలములు వికసిస్తాయి. కానీ ఈశ్వరునికి అభిముఖంగా అమ్మవారు ఉండటం వలన చంద్రుని చూడలేక కమలములు వాడిపోయి గుడ్డివైనాయట. కమలమంటే భక్తుని మనస్సు. ఆ మనస్సుని అజ్ఞానమనే గుడ్డితనంలో ఉంచేది ఆ తల్లే. దానిని తొలగించి జ్ఞానప్రకాశాన్ని ఇచ్చేది ఆ తల్లేనని బోధిస్తున్నారు.

**శ్లో॥** ఉరరీకరోమి సన్తత- మూష్మలఫాలేన లాలితం పుంసా।
ఉపకమ్పముచిఖేలన- ముర్వీధరవంశసమ్భవదున్మేషమ్। ॥35॥

**పద విభాగం:** ఉరరీకరోమి- సన్తతమ్- ఊష్మలఫాలేన- లాలితం-పుంసా- ఉపకమ్పముచిఖేలనమ్-

ఉర్వీధరవంశసమ్పదున్మేషమ్.

**అన్వయం:** ఊష్మలఫాలేన పుంసా సన్తతం లాలితం ఉపకమ్పం ఉచితఖేలనం ఉర్వీధరవంశ సమ్పదున్మేషం ఉరరీకరోమి.

**ప్రతిపదార్థం :** ఊష్మలఫాలేన = అగ్ని నుదుటియందుగల పుంసా= పురుషునిచేత సన్తతం= ఎల్లప్పుడూ లాలితం= లాలింపబడిన ఉపకమ్పం = కంపానదీనమీపమున ఉచితఖేలనం= తగిన ఆటలు గల ఉర్వీధర వంశసమ్పదున్మేషం= పర్వతవంశసంపదకు వికాసమైన అమ్మవారిని ఉరరీకరోమి= అంగీకరించెదను.



**తాత్పర్యము:** నుదుటి యందు అగ్నిని ధరించిన పురుషుని చేత నిరంతరమూ లాలింపడిన కంపానదీ తీరమున తగిన ఆటలు ఆడుకొను పర్వతవంశసంపదకు వికాసమును కలిగించిన అమ్మవారిని అంగీకరించెదను.

**బాలమనోజ్ఞ:** శివుడు తన ఫాలమందున్న అగ్నిచే మన్మథుని దహించినవాడు. తన మూడవనేత్రమున ఉన్న అగ్నితో ప్రళయాన్ని కల్పించి సృష్టిని తనలో లయం చేసుకునేవాడు. అటువంటి ప్రళయకాలరుద్రుడు అమ్మవారిని తన చల్లటిచూపులతో లాలిస్తూ ఉంటాడట. ఆయనే చే లాలింపబడే అమ్మవారు స్వామితో కలిసి తనకు తగిన ఆటలను ఆడుతూ కంపాతీరంలో ఉంది. ఆవిడ ఆడుకునే ఆటలంటే ఏమిటి? సృష్టిస్థితిలయలే కదా ఆ తల్లి ఆటలు. అటువంటి ఆ తల్లి వలన హిమవత్పర్వతరాజు వంశము ప్రకాశిస్తోంది.

# శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారి విజయయాత్ర విశేషాలు



ఆగస్టు 1, 2024: ఒరిక్కైలోని శ్రీమఠం శిబిరంలో వార్షిక వైదిక సమష్టి భిక్షావందనం నిర్వహించారు.





### ఆడి పెరుక్కు - 2 ఆగస్టు 2024

తమిళనాడులో పవిత్రమైన ఆడిమాసంలోని 18వ రోజును ఆడి పెరుక్కుగా జరుపుకుంటారు. ఈ రోజున, తమిళనాడులోని కావేరి నదికి ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీ.


దక్షిణ భారత సంప్రదాయం ప్రకారం, కావేరి నది ఒడ్డున నివసించకపోయినా, సమీపంలోని నీటి ప్రదేశానికి

(చెరువు, ఆలయ కోనేరు, సరస్సు మొదలైనవి) వెళ్లి, అందులో దివ్య కావేరీ నదిని ఆవాహన చేసి పూజ చేయవచ్చు. కావేరీ అష్టోత్తరం లేదా లక్ష్మీ అష్టోత్తరం, అర్చన తరువాత షోడశోపచారం, నైవేద్యం, దీపారాధన నిర్వహిస్తారు.

పై ఆచారం ప్రకారం, శ్రీ కంచి కామకోటి పీఠంలోని పండితులు ప్రతి సంవత్సరం శ్రీమఠం క్యాంపులో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 2 ఆగస్టు 2024 తెల్లవారుజామున పూజ్యశ్రీ శంకర విజయేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామివారి ఆశీస్సులతో పండితులు, భక్తులతో కలిసి ఒరిక్కైలోని పూజ్య కంచి మహాస్వామి మణిమండపం పక్కనే ఉన్న 'పాలార్' (క్షీర-నది) నదికి వెళ్లి కావేరీ పూజ నిర్వహించారు. పవిత్ర జలంతో నిండిన కలశం శ్రీమఠం శిబిరానికి తీసుకువచ్చి పూజ్య స్వామివారికి సమర్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేక నైవేద్యప్రసాదాలు పంపిణీ చేశారు.

కాకారో కలుషం హన్తి వేకారో వాంఛిత ప్రదః । రీకారో మోక్షదం నృణాం కావేరీత్యవధారయ ॥

కావేరిలో "కా" అనే పదం అన్ని పాపాలను తొలగిస్తుంది, "వే" అంటే మన కోరికలను తీర్చడం, "రీ " అంటే జనన మరణ చక్రం నుండి ఉపశమనం కలిగించడం. కావేరీ నది గొప్పతనం అలాంటిది.

మూలతో బ్రహ్మరూపాయ మధ్యతో విష్ణురూపిణే ।
అగ్రతః శివరూపాయ వృక్షరాజాయ తే నమః ॥

**సెప్టెంబర్ 2:** పూజ్య మహాస్వామి మణిమండపం, ఒరిక్కై వద్ద సోమవార అమావాస్య పుణ్య కాలంలో అశ్వత్థ వృక్ష ప్రదక్షిణం, పూజలు నిర్వహిస్తున్న స్వామివారు.




వినాయక చతుర్థి – 7 సెప్టెంబరు 2024 నాడు ఉదయం పూజ్యశ్రీ శంకరాచార్య స్వామివారి ఆశీస్సులు, సాన్నిధ్యంలో సహస్ర మోదక గణపతి హోమం శ్రీమఠం శిబిరంలో జరిగింది.





13–14 సెప్టెంబర్ 2024: పూజ్యశ్రీ శంకరాచార్య స్వామివారి ఆశీస్సులతో ఓరిక్కై పూజ్యశ్రీ మహాస్వామి మణిమండపంలో సహస్ర సువాసిని పూజలు ఘనంగా జరిగింది.







**18 సెప్టెంబర్ 2024:** చాతుర్మాస్య వ్రతం ముగింపు సందర్భంగా పూజ్యశ్రీ శంకర విజయేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామివారి విశ్వరూప యాత్ర ఒరిక్కై మహాస్వామివారి మణిమండపం నుండి శ్రీ కంచి కామాక్షి దేవి దేవస్థానం వరకు ఉత్సవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పారాయణ, నామ సంకీర్తన, నాట్య, వాద్య ధ్వనులతో భక్తులు స్వామివారికి ఘనంగా స్వాగతం పలికారు.












శ్రీ కంచి కామకోటి పీఠం, కాంచీపురానికి సమీపంలో ఉన్న నల్లూరులో శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించింది. శ్రీమఠం శిబిరంలో నవరాత్రి సంబరాలు, పూజలు, వేద పారాయణం, చండీహోమం, సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. పూజ్యశ్రీ శంకరాచార్య స్వామివారు అన్ని కార్యక్రమాలలో పాల్గొని భక్తులందరినీ ఆశీర్వదించారు













**08 అక్టోబర్ 2024** నల్లూరు, ఏనాతుర్ శ్రీ మఠం శిబిరంలో నీలగిరి బడుగ గిరిజన వాసులు అందరినీ తమ నాట్య గానంతో అలరించి స్వామివారి ఆశీర్వాదాన్ని పొందారు. అలాగే దీప పూజ, బొమ్మలాట మొదలగు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.




**13 అక్టోబర్ 2024** శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి విశ్వమహావిద్యాలయంలో స్వామివారు వి.ఆర్.ఎన్.టి సంస్థ వేద పరీక్షలలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ప్రమాణపత్రము ప్రసాదించి ఆశీర్వదించారు.



JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA


SRI CHANDRAMOULEESWARAYA NAMAHA

## SRI KANCHI KAMAKOTI PEETAM

**Jagadguru Shankaracharya Swamigal**

**Shrimatam Samsthanam, Kanchipuram**





# Vijaya Yatra

of

## Shri Kanchi Kamakoti Peetadhipati Jagadguru Pujyashri Shankara Vijayendra Saraswathi Shankaracharya Swamiji

## Programme - Schedule -upto 28 Nov. 2024

| DATE | PLACE | PLACE OF PUJA |
|---|---|---|
| Upto 16th Nov. 2024 | Dharmasthala | Vasanta Mahal, Dharmasthala, Dakshina Kannada, Karnataka |
| 17th Nov. 2024 | Edneer | Sri Edneer Math Samsthanam, Kasarkod District, Kerala 671541 |
| 18th-19th Nov. 2024 | Sullia | Bharadwaj ashrama, Aramboor post, Sullia Taluk, Dakshina Kannada Dist., Karnataka (18th- Karthika Somavaram - Ekadasha Rudram) |
| 20th-21st Nov. 2024 | Udupi | Shree Sharadha Mantapa Sharadha Nagara Kunjibettu, Udupi 576102 |
| 22nd-23rd Nov. 2024 | Shakatapuram | Shri Jagadguru Badri Shankaracharya Samasthanamu, Shrividya Peetham, Shakatapuram 577126 |
| 24th Nov. 2024 | Teerthahalli | Shri Ramachandrapura Matha, Teerthahalli, 577432 |
| 25th-26th Nov. 2024 | Hassan | SDM College, Hassan, Karnataka (25th- Karthika Somavara Puja) |
| 27th Nov. 2024 | Bangalore | Kamalalayam, 25, Nimbekaipura Road, Virgo Nagar Post, Bangalore - 560049 (27th - Dwadashi) |
| 28th Nov. 2024 | Tirupati | Sri Kanchi Kamakoti Peetam Shankara Matam Paduka Mandapam, Vinayak Nagar, Tirupati (28th - Pradosha Puja, 29th - Shukravara Puja) |

JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA

श्रीचन्द्रशेखरेन्द्रसरस्वतीविश्वमहाविद्यालयः

# Sri Chandrasekharendra Saraswathi Viswa Mahavidyalaya (SCSVMV)

Deemed to be University | Accredited by NAAC with "A" Grade
(Sponsored and run by Sri Kanchi Kamakoti Peetam Charitable Trust)



Enathur, Kanchipuram, Tamilnadu 631561.

## Centre for Distance and Online Education

# ADMISSION NOTIFICATION

**ACADEMIC YEAR 2024 BATCH**

Open and Distance Learning (ODL)

## UG - B.A. SANSKRIT

**3 YEARS DURATION**

ELIGIBILITY: A pass in +2 or equivalent examination from any recognized Board / University with basic Sanskrit knowledge.

## PG - M.A. SANSKRIT

**2 YEARS DURATION**

ELIGIBILITY: B.A. Sanskrit or Sastri or any UG Degree from any recognized University with basic Sanskrit knowledge.

Online Application

Last date to submit online application: **15.11.2024**

Visit our website
**https://kanchiuniv.ac.in/**


odl@kanchiuniv.ac.in

Apply Now

+91 94446 25667
+91 96550 35217

- REGISTRAR i/c

# శ్రీ కామకోటివాణి
## ప్రత్యేక సంచిక




వెల - 250 రూపాయలు
(Postage 50 రూపాయలు అదనం)

ప్రత్యేక సంచిక కోసము
సంప్రదించవలసిన వివరాలు:

**శ్రీ కంచి కామకోటి క్యాంపు**

Email ID - srikamakotivaani@gmail.com



## For Sri Kamakoti Vaani Subscription



**Bank Details:**

**Account Name:**
Sri Kamakoti Touryatrika Trust SKV
Bank: ICICI Bank
Account No.: 440705000345
IFSC Code: ICIC0004407
UPI ID – SRIKAMAKOTIVAANI@icici

**Subscription**

₹ 480 INR (India)
₹ 5000 INR
(Lifetime, for 10 years)

e-mail id -
srikamakotivaani@gmail.com

Scan me!

Sri Kamakoti Vaani subscription payment gateway.

Donors may please contact:
**Prayaga Srinivas : 800 800 1335**

JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA

**SRI CHANDRAMOULEESWARAYA NAMAHA**



## SHRI KANCHI KAMAKOTI PEETAM
### JAGADGURU SHANKARACHARYA SWAMIGAL
### SHRIMATAM SAMSTHANAM

1, SALAI STREET, KANCHIPURAM, TAMILNADU - 631502 INDIA

**www.kamakoti.org**

**fb.me/srikamakoti**

**youtube.com/kanchimath**

**twitter.com/kanchimatham**

**instagram.com/kanchimutt**

Koo

**koo @kamakoti**

**www.kamakoti.tv**

**www.kanchimuttseva.org**

# ESEVA PORTAL

for Online Puja Bookings & Contributions

JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA



వేంకటేశ సమో దేవః  న భూతో న భవిష్యతి